


నేడు పోలవరంలో మంత్రి అంబటి పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు



రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు ఈ నెల తొమ్మిదో తేదీ గురువారం సాయంత్రం 4.30 గంటలకు విజయవాడ నుండి బయలుదేరి రాత్రి 7.50 గంటలకు పోలవరం చేరుకుని రాత్రి బస చేస్తారు. 10వ తేదీ శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుండి 11 గంటల వరకు పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనుల ప్రగతిపై అధికారులతో సమీక్షిస్తారు. మధ్యాహ్నం భోజనానంతరం 3.10 గంటలకు పోలవరం నుండి రాజమండ్రి బయలుదేరి వెళతారు.

మోగిన ఎంఎల్‌సి నగారా

16న స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల నోటిఫికేషన్

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన రెండు స్థానాలకు ఎన్నికలు

మార్చి 3తో అంగర, పాందువ్వ శ్రీను పదవీకాలం పూర్తి

ఈసారి వైసిపికి రెండుస్థానాలూ దక్కే అవకాశం

టిక్కెట్ కోసం వైసిపిలో పెద్దసంఖ్యలో ఆశావాహులు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల నగారా మోగింది. ఎపిలో పలు ఎంఎల్‌సి స్థానాలకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ గురువారం విడుదల చేసింది. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎంఎల్‌సిలుగా ఉన్న అంగర రామ్మోహన్, మంతెన సత్యనారాయణరాజు (పాందువ్వ శ్రీను) పదవీ కాలం మార్చి మూడో తేదీతో పూర్తి కానుంది. జిల్లాలో ఈ రెండు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ రెండుస్థానాల్లో ప్రస్తుతం టిడిపికి చెందిన ఎంఎల్‌సిలు ఉన్నారు. ఈసారి ఎన్నికల్లో రెండు స్థానాలను వైసిపి ఏకగ్రీవంగా కైవసం చేసుకునే పరిస్థితి ఉంది. స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటర్లుగా జడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, కార్పొరేషన్ కార్పొరేటర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు ఉంటారు. ఎంఎల్‌సి ఎన్నికలు ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జరగనున్నాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 48 జడ్‌పిటిసి స్థానాలుండగా 46 స్థానాలు వైసిపివే. టిడిపి, జనసేనకు ఒక్కోస్థానం ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 863 ఎంపిటిసి స్థానాలకుగాను వైసిపి-673, టిడిపి-102, జనసేన-61, బిజెపి-3, కాంగ్రెస్-1, మిగిలిన స్థానాల్లో ఇతరులు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 11 పట్టణాలు ఉన్నాయి. వీటిలో ఏలూరు కార్పొరేషన్, తాడేపల్లిగూడెం, భీమవరం, నరసాపురం, పాలకొల్లు, తణుకు, కొవ్వూరు, నిడదవోలు, జంగారెడ్డిగూడెం మున్సిపాల్టీలు ఉండగా, ఆకివీడు, చింతలపూడి నగర పంచాయతీలుగా ఉన్నాయి. వీటిలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, కొవ్వూరు, నిడదవోలు, నరసాపురం, ఆకివీడు పట్టణాలకు మాత్రమే మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. మిగిలిన పట్టణాల్లో కోర్టు కేసుల నేపథ్యంలో ఎన్నికలు జరగలేదు. ఎన్నికలు జరిగిన కార్పొరేషన్, ఐదు మున్సిపాల్టీలు, ఒక నగర పంచాయతీలో మొత్తం 50 మంది కార్పొరేటర్లు, 125 మంది మున్సిపల్ కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో 150 మంది వైసిపికి చెందిన వారే. జిల్లాలో మొత్తం జెడ్‌పిటిసి, ఎంపిటిసి, కార్పొరేటర్లు, కౌన్సిలర్ల రూపంలో స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఓటర్లు 1,086 మంది ఉండగా వీరిలో 869 మంది వైసిపి వారే ఉన్నారు. దీంతో రెండు ఎంఎల్‌సి స్థానాలు వైసిపికే ఏకగ్రీవంగా దక్కే అవకాశం ఉంది. దీంతో ఈ పదవులను ఆశిస్తున్న నాయకులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

ఎంఎల్‌సి పదవి ఎవరిని వరించేనో..

జిల్లాకు రెండు ఎంఎల్‌సి పదవులు రానుండటంతో వైసిపిలో ఆశావహులంతా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. మంత్రులు, ఎంఎల్‌ఎల ద్వారా పదవుల కోసం తీవ్రంగా యత్నిస్తున్నారు. మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు మరోసారి ఎంఎల్‌సి పదవి కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఏలూరులో ఉన్న పిల్లంగోళ్ల శ్రీలక్ష్మితోపాటు జిల్లాలోని పలువురు వైసిపి నాయకులు ఎంఎల్‌సి పదవి దక్కించుకునేందుకు ముమ్మరంగా తమ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆశావహుల జాబితా ఎక్కువగానే ఉన్నట్లు చెబుతున్నారు. రెండు పదవులను డెల్టాకు ఒకటి, మెట్టకు ఒకటి కేటాయిస్తారా అనే చర్చ సైతం నడుస్తోంది. డిసిసిబి, డిసిఎంఎస్, జెడ్‌పి ఛైర్మన్, రెండు మంత్రి పదవులు కొత్త పశ్చిమగోదావరి జిల్లాకే దక్కాయి. ఈ సారి రెండు పదవులు ఏలూరు జిల్లావాసులకు కట్టబెట్టాలనే డిమాండ్ వైసిపిలో విన్పిస్తోంది. దీనిపై అధిష్టానం ఏవిధంగా ముందుకు సాగుతుందో వేచిచూడాలి.

అమల్లోకి ఎన్నికల కోడ్

స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ గురువారం కేంద్ర ఎన్నికల కమిషన్ విడుదల చేయడంతో జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకూ కొత్త పనులు ప్రారంభించడం వంటి కార్యక్రమాలూ చేపట్టబోరు.

ప్రజాప్రతినిధులు లేని మున్సిపాల్టీలు

తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం, పాలకొల్లు, చింతలపూడి నగర పంచాయతీ

ఎంఎల్‌సి ఎన్నికల షెడ్యూల్ ఇలా

నోటిఫికేషన్: ఫిబ్రవరి 16
నామినేషన్లకు చివరితేదీ: ఫిబ్రవరి 23
నామినేషన్ల పరిశీలన : ఫిబ్రవరి 24
ఉపసంహరణ గడువు: ఫిబ్రవరి 27
పోలింగ్: మార్చి 13
ఓట్ల లెక్కింపు: మార్చి 16
ఎన్నికల ప్రక్రియ పూర్తి: మార్చి 21

ఓటర్లు

జెడ్‌పిటిసి సభ్యులు: 48
ఎంపిటిసి సభ్యులు: 863
కార్పొరేటర్లు: 50
కౌన్సిలర్లు: 175

బలాబలాలు

మొత్తం ఓటర్లు: 1,086
వైసిపి ప్రతినిధులు: 869
టిడిపి.జనసేన, ఇతరులు: 217

లేఅవుట్‌లోకి నీళ్లు.. లబ్ధిదారులకు కన్నీళ్లు..!

పాలమూరులోని జగనన్న లేఅవుట్‌లోకి పొలాల నీరు

పట్టించుకోని అధికారులు

సాగునీరందక రైతులకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

'జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి.. త్వరితగతిన పనులు పూర్తి చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలి'.. ఇదీ జిల్లా అధికారులు దిగువస్థాయి అధికారులకు ప్రతిరోజూ చేసే దిశానిర్దేశం. అయితే పాలమూరులోని జగనన్న లేఅవుట్ విషయంలో మండల, స్థానిక అధికారుల తీరు దానికి పూర్తి భిన్నంగా ఉంది. పేద లబ్ధిదారులంటే అలుసో.. లేక మరో కారణమోగాని ఈ లేఅవుట్ ప్రారంభం నుంచి అడుగడుగునా లబ్ధిదారులకు అష్టకష్టాలు తప్పడం లేదు.

పాలమూరులోని జగనన్న లేఅవుట్‌ను పితాని కాలనీ వెనుక ఉన్న పొలాలను కొనుగోలు చేసి ఏర్పాటు చేశారు. గ్రామంలోని లబ్ధిదారులకు స్థలాల కేటాయింపు చేశారు. ఈ లేఅవుట్‌ను ఆనుకుని పాలమూరు డ్రెయిన్ కూడా ఉండటంతో స్థలాల్లోకి వాహనాలు వెళ్లేందుకు తాత్కాలిక ప్రాతిపదికన తూరలు పెట్టి రోడ్డు వేశారు. ఇంతవరకూ బాగానే ఉంది. అయితే లేఅవుట్ పూడిక తూతూమంత్రంగా నిర్వహించడంతో పక్కనున్న పొలాల్లోని నీరు తరచూ లేఅవుట్‌ను ముంచెత్తుతోంది. తాజాగా గురువారం ఉదయానికి లేఅవుట్‌లోకి పక్కనే ఉన్న పొలాల్లోని నీరు ప్రవేశించింది. ఫలితంగా ఆ ప్రాంతం, లోపలి భాగంలో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు మెటీరియల్‌ను తీసుకెళ్లేందుకు అవకాశం లేకుండాపోయింది. గతంలోనూ ఇదే పరిస్థితి ఎదురైనా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోకపోవడంతో మళ్లీ ఈ దుస్థితి దాపురించిందని లబ్ధిదారులు వాపోతున్నారు. వర్షాకాలంలో ప్రధానంగా ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో అయితే ఈ లేఅవుట్ పూర్తిగా జలమయమైంది. దానికి ముందు ఇళ్ల నిర్మాణం చురుగ్గా సాగుతున్న సమయంలో ముందస్తు సమాచారం ఇవ్వకుండా గత జూన్‌లో మురుగు డ్రెయిన్‌పై తూరలు తొలగించి పక్కనే వేసి అక్కడ వంతెన నిర్మాణం చేపట్టారు. అయితే ఆ తూరలపై కంకర బదులు మట్టి వేసి వదిలేయడంతో దానిపై నుంచి వాహనాలు వెళ్లే పరిస్థితి లేకుండాపోయింది. వంతెన నిర్మాణంలో నాణ్యతపైనా విమర్శలు వెలువెత్తాయి. పితాని కాలనీ రోడ్డుకు, జగనన్న కాలనీ రోడ్డుకు సంబంధం లేకుండా ఓపక్కగా వంతెన నిర్మించారంటే అధికారుల అశ్రద్ధ, నిర్లక్ష్యం, పర్యవేక్షణా లోపం ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన స్థానిక ఎంఎల్‌ఎ, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాధరాజు దృష్టికి లబ్ధిదారులు సమస్యలు తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎంఎల్‌ఎ ఆదేశాల మేరకు ఇప్పుడిప్పుడే లేఅవుట్‌లో రెండు రోడ్ల నిర్మాణానికి రాళ్లు పోశారు. దీంతో రోడ్లు, డ్రెయిన్లు, కరెంటు, తాగునీరు వంటి సౌకర్యాలు త్వరలోనే వస్తాయని లబ్ధిదారులంతా సంతోషించారు. ఇప్పటికే కొంతమంది ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకుని గృహ ప్రవేశాలు చేసి అక్కడే నివాసముంటున్నారు. దీంతో మిగిలిన లబ్ధిదారులు కూడా కష్టమైనా అప్పు చేసి మరీ పనులు ప్రారంభించారు. గతంలో లేఅవుట్‌లోకి నీళ్లొచ్చినప్పుడు మెటీరియల్ వాహనాలు నేరుగా వచ్చే అవకాశం లేక పితాని కాలనీలో దిగుమతి చేయించి కూలీలతో మోయించారు. దీనికిగాను ఒక్కో లబ్ధిదారునికి రూ.పది వేల నుంచి రూ.15 వేలకు పైగా అదనపు ఖర్చయ్యింది. తాజాగా మరోసారి నీళ్లు రావడంతో లబ్ధిదారులంతా తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికైనా స్థానిక అధికారులు నిర్లిప్తత వీడేలా జిల్లా అధికారులు నేరుగా లేఅవుట్‌ను సందర్శించి లోపాలను చక్కదిద్దాలని, లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



పాలమూరు లేఅవుట్‌లోకి చేరిన సాగునీరు

సాగునీరు సైతం వృధానేగా..!

పాలమూరులోని లేఅవుట్‌లోకి పొలాల్లోని నీరు రావడంపై రైతులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సాగునీటి కొరత వెంటాడుతున్న తరుణంలో నీరు వృధా కావడంతో ఇటు సాగుకూ ఇబ్బందేనని, అటు లబ్ధిదారులకు నష్టదాయమని వ్యాఖ్యానిస్తున్నారు. దీనిపైనా జిల్లా అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.



పూడికకు ఆదేశాలిచ్చా

వి.పూర్ణబాబ్జి, ఎంపిడిఒ, పెనుమంట్ర

జగనన్న లేఅవుట్‌లోకి పక్కనే ఉన్న పొలాల్లోని నీరు చేరిందని తెలియగానే ఆ ప్రాంతంలో పూడికకు ఆదేశాలిచ్చాను. ఈ మేరకు హౌసింగ్ ఎఇ మల్లేశ్వరరావు, పాలమూరు పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి ఎస్.మోహనరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నరసింహకు ఫోన్ చేసి స్పష్టమైన మార్గదర్శకాలిచ్చాను.

స్వచ్ఛ సంకల్పంలో విస్సాకోడేరు ముందంజ

డంపింగ్ యార్డును ప్రారంభించిన డిసిసిబి ఛైర్మన్ పివిఎల్

సర్పంచి శ్రీనివాస్ అభినందనీయులు: జెడ్‌పి సిఇఒ రవికుమార్

విస్సాకోడేరు ఆదర్శ గ్రామం: డిపిఆర్‌సి జిల్లా కోఆర్డినేటర్ శిరీష

ప్రజాశక్తి - పాలకోడేరు

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి ప్రజలను ఆరోగ్యవంతంగా ఉంచాలనే ముఖ్యోద్దేశంతో వైసిపి ప్రభుత్వం చేపట్టిన జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమానికి విస్సాకోడేరు పంచాయతీ సహకరించింది. పంచాయతీ సర్పంచి బొల్లా శ్రీనివాస్ చొరవతో పంచాయతీ పాలకవర్గం, అధికారులు, వివిధ రాజకీయ పార్టీలు, గ్రామస్తుల సహకారంతో గ్రామాన్ని దీర్ఘకాలంగా వేధిస్తున్న పారిశుధ్య సమస్యకు పరిష్కారం లభించింది. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా గ్రామంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రం (ఎస్‌డబ్ల్యుసిపిసి) షెడ్డును అత్యాధునిక పద్ధతిలో తీర్చిదిద్దారు.

ఆదాయం సృష్టించడం అభినందనీయం డిసిసిబి ఛైర్మన్ పివిఎల్


గ్రామాలు స్వయం పోషకాలుగా ఆదాయ వనరులు సృష్టించుకోవడం అభినందనీయమని, దీనికి సర్పంచి శ్రీనివాస్ కృషి అమోఘమని డిసిసిబి ఛైర్మన్, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహారాజు అన్నారు. విస్సాకోడేరులో నిర్మించిన డంపింగ్ యార్డును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు ఘన నివాళు లర్పించారు. డిపిఆర్‌సి ఫీల్డ్ టెక్నికల్ జిల్లా కోఆర్డినేటర్ ఎడ్వర్డ్ డంపింగ్ యార్డ్ ప్రాముఖ్యత, వర్మీ కంపోస్టు, సంపద తయారీ గూర్చి వివరించారు. ఈ సందర్భంగా పివిఎల్ మట్లాడుతూ గ్రామంలో సేకరించిన చెత్త ద్వారా సంపదను సృష్టించడం అభినందనీయమన్నారు. ఈ విధంగా ప్రతి గ్రామంలో ఆలోచన చేయాలని సూచించారు. ఢిల్లీకి చెందిన బిజెపి నేత పురిగుళ్ల రఘురామ్ మాట్లాడుతూ విస్సాకోడేరు గ్రామానికి పారిశుధ్యంలో అధిక ప్రాధాన్యత లభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు), సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు భూపతిరాజు వంశీకృష్ణంరాజు, కోఆప్షన్ సభ్యులు డాక్టర్ డిఆర్.స్వర్ణలత, వైస్ ఎంపిపిలు ఆదాడ లక్ష్మీతులసి, చోడదాశి నరేష్, సర్పంచులు జంగం సూరిబాబు, చింతపల్లి వెంకటనారాయణ, కడలి జయలక్ష్మి, ఉప సర్పంచి నాగరాజు, ఎంపిటిసిలు బొల్లం గాంధీ, లక్ష్మీపతి, నాయకులు పెన్మెత్స శ్రీనివాస్‌రాజు, దుండి అశోక్‌బాబు, సామంతపూడి మారాజు (బాబు), పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డును ప్రారంభిస్తున్న పివిఎల్.నర్సింహరాజు

సర్పంచి శ్రీనివాస్ అభినందనీయులు జెడ్‌పి సిఇఒ రవికుమార్

గ్రామంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసిన సర్పంచి బొల్లా శ్రీనివాస్ అభినందనీయులని జెడ్‌పి సిఇఒ రవికుమార్ అన్నారు. విస్సాకోడేరులో ప్రారంభించిన డంపింగ్ యార్డ్‌ను డిపిఆర్‌సి జిల్లా కోఆర్డినేటర్ శిరీషతో కలిసి ఆయన గురువారం సందర్శించారు. డంపింగ్ యార్డ్, వర్మి, వానపాముల తయారీ, కూరగాయలు, పండ్లు మొక్కల పెంపకం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఇఒ మాట్లాడుతూ జిల్లాలో అత్యున్నతమైన డంపింగ్ యార్డు ఇదేనన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవం నాడు సర్పంచి శ్రీనివాస్‌ను మెమెంటో, సర్టిఫికెట్‌తో ఘనంగా సత్కరిస్తామని చెప్పారు. డిపిఆర్‌సి జిల్లా కోఆర్డినేటర్ శిరీషా మాట్లాడు విస్సాకోడేరు డంపింగ్ యార్డును అధునాతన పద్ధతిలో తీర్చిదిద్దడంతోపాటు దీనిపై ఆదాయాన్ని ఆర్జించడం అభినందనీయమన్నారు. అనంతరం గ్రామంలో కాళ్ల, పెంటపాడు మండలాల నుంచి వచ్చిన బృందాలు పర్యటించాయి. పంచాయతీ సరఫరా చేసిన చెత్త డబ్బాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేయాలని సూచించి సంపూర్ణ పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ రెడ్డియ్య, కాళ్ల ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ప్రభాకర్, కాళ్ల, పెంటపాడు ఇఒపిఆర్‌డిఒలు జి.సత్యనారాయణ, ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు జార్జిప్రసాద్, పోలయ్య, లక్ష్మి, రాజేష్, శ్యామ్, రమాలీల, పెద్దిరాజు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీరులు పాల్గొన్నారు.



పివిఎల్‌కు స్వాగతం పలుకుతున్న సర్పంచి, నేతలు

సహకారం మరువలేను: సర్పంచి బొల్లా శ్రీనివాస్

గ్రామాభివృద్ధికి, డంపింగ్ యార్డ్ నిర్మాణానికి గ్రామస్తులు అందించిన సహకారం మరువలేనని విస్సాకోడేరు సర్పంచి బొల్లా శ్రీనివాస్ అన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచి ప్రజలుకు ఆరోగ్యవంత జీవితాన్ని అందించాలనే ముఖ్యోద్దేశంతో డంపింగ్ యార్డును నిర్మించామన్నారు. గ్రామంలోని చెత్తను సేకరించడంతోపాటు తడి, పొడిగా వేరుచేసి వీటి ద్వారా వర్మీని తయారుచేసి అమ్మడం ద్వారా పంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దీనికి సహకరించిన పివిఎల్.నరసింహరాజు, అధికారులు, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా బ్లాక్ డే

అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - భీమవరం



నినదిస్తున్న రైతు, ప్రజాసంఘాల నేతలు

రైతాంగ వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ అఖిలపక్ష రైతుసంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక బిఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం, హెడ్ పోస్టాఫీస్ వద్ద గురువారం బ్లాక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుసంఘాల నేతలు, రైతులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినదించారు. అనంతరం అఖిలపక్ష రైతుసంఘాల నాయకులు మాట్లాడుతూ బడ్జెట్లో వ్యవసాయ రంగానికి నిధులు తగ్గిస్తే రైతుల ఆదాయం ఏరకంగా రెట్టింపవుతుందని ప్రశ్నించారు. 2022-23 బడ్జెట్లో పిఎం కిసాన్ నిధికి రూ.12,950 కోట్లు కేటాయిస్తే ప్రస్తుత బడ్జెట్లో రూ.10,787 కోట్లకు తగ్గించారని తెలిపారు. పిఎం కిసాన్ పథకం కింద రైతులకు అందిస్తున్న రూ.ఆరు వేలు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. వ్యవసాయ సాగు ఖర్చులు రెట్టింపయ్యాయని, బడ్జెట్లో పిఎం కిసాన్ పథకం పథకం సొమ్మును రెట్టింపు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధి హామీకి నిధులు తగ్గించడం దుర్మార్గమన్నారు. బిజెపి విధానాలు కార్పొరేట్ శక్తుల అభివృద్ధి కోసమే తప్ప రైతులు, ప్రజలు, కార్మికుల కోసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరాం, ఎఐకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు లంక కృష్ణమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, ఎఐకెఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దండు శ్రీనివాసరాజు, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బాలం విజయకుమార్, కిలారి నాయుడు, గండికోట వెంకటేశ్వరరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, దుగ్గిరాల శ్రీనివాస్, ఇందుకూరి శివాజీరాజు పాల్గొన్నారు.

ఫేస్ అటెండెన్స్ నుంచి మినహాయించాలి

తహశీల్దార్‌కు విఆర్‌ఎల వినతి

ప్రజాశక్తి - పాలకోడేరు

ఇటీవల ప్రవేశపెట్టిన ఫేస్ అటెండెన్స్ యాప్ వల్ల అనేక ఇబ్బందులు ఉన్నాయని, దీనినుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ విఆర్‌ఎలు తహశీల్దార్ షేక్ హుస్సేన్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విఆర్‌ఎలు పలు సమస్యలు తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. వయోభారం, స్మార్ట్‌ఫోన్లు కొనే పరిస్థితి లేకపోవడం, అనారోగ్యం తదితర కారణాల వల్ల ఫేస్ అటెండెన్స్ యాప్ వినియోగంలో పలు ఇబ్బందులు తలెత్తుతున్నా యన్నారు. ఫేస్ యాప్ నుంచి విఆర్‌ఎలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం మండల అధ్యక్షులు సన్నమండ నాని, కార్యదర్శి ఆకుమూరి రుబీయమ్మ, ట్రెజరర్ కింతాడ రవి, సలహాదారుడు కడిమి రవి, గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పంచాయతీ కార్మికులు వినతి

ప్రజాశక్తి - యలమంచిలి



పంచాయతీ విస్తరణ అధికారికి వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్‌ఐ అమలు చేయాలని సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ విస్తరణాధికారి కెఎం.వైభావతికి పంచాయతీ కార్మికుల వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టెండర్లతో సంబంధం లేకుండా పని కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని జిఒలున్నా అమలుకు నోచుకోవడం లేదన్నారు. పంచాయతీలకు లేనందున సమస్యలు ఎదురవుతున్నాయని చెప్పడం హాస్యాస్పదమన్నారు. తక్షణమే పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శివరాం, కిరణ్, ప్రభాకర్‌రావు, రమణ తదితరులు పాల్గొని మాట్లాడారు.

న్యాయవాదిపై దాడికి నిరసన

ప్రజాశక్తి - నరసాపురం



కోర్టు వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

నంద్యాల జిల్లా డోన్ బార్ అసోసియేషన్ కోశాధికారి, న్యాయవాది పులి దామోదర్‌పై ఈ నెల 6న కొందరు వ్యక్తులు దాడి చేయడాన్ని నిరసిస్తూ గురువారం స్థానిక న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నరసాపురం న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కామన బాల సత్యనారాయణ (బుజ్జి) మాట్లాడుతూ న్యాయవాది దామోదర్‌పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల రక్షణకు చట్టం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పూరిళ్ల శ్రీనివాస్, యర్రంశెట్టి దేవేంద్ర ఫణికర్, గన్నాబత్తుల వల్లభరావు, గోడి సత్యనారాయణ, నెక్కంటి క్రాంతికుమార్, చదలవాడ జ్ఞానప్రకాష్, కొత్తపల్లి రమేష్, రంపా పుల్లాజీ, దొంగ నరసింహరాజు, చోడదాసి శ్రీధర్, సిహెచ్.వెంకటేశ్వరరావు, నక్కా ఆనంద్ బాబు, నారిన శ్రీనివాసరావు, కొప్పినీడి చిట్టి పద్మజ, కురెళ్ల అన్నపూర్ణ, కొప్పర్తి శిరీష, చాముండేశ్వరి, బాలవల్లి తదితరులు పాల్గొన్నారు.

80 శాతం ఓటర్లు ఆధార్‌తో అనుసంధానం : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

జిల్లాలో 14,38,098 మంది ఓటర్లు ఉన్నారని, వీరి వివరాలను ఆధార్ కార్డులతో 80.76 శాతం అనుసంధానం చేశారని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్‌మీనా గురువారం ఓటర్ల నమోదు, దరఖాస్తుల పరిష్కారం, ఎన్నికల జాబితాలో జనాభా సంబంధిత సారూప్య అంశాలపై అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ మురళీ, జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణవేణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఓటరు నమోదు, చిరునామా మార్పు గతేడాది ఆగస్టు 1 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 8వ తేదీ వరకు వచ్చిన 86,557 దరఖాస్తుల్లో 76,359లను పరిశీలన అనంతరం ఆమోదించామని తెలిపారు. 7,534 దరఖాస్తులను తిరస్కరించినట్లు తెలిపారు. జిల్లాలో ఫారం-6కి చెందిన 31,530 దరఖాస్తులకుగాను 27,021 ఆమోదించగా 2,829 తిరస్కరించామని, 1,779 పరిశీలన దశలో ఉన్నాయని తెలిపారు. ఫారం-7 కోసం 47,998 దరఖాస్తులకుగాను 43,821 ఆమోదించామని, 3,668 తిరస్కరించామని చెప్పారు. ఫారం-8కి చెందిన 7,029 దరఖాస్తులకుగాను 5,517 ఆమోదించగా 1,037 తిరస్కరించామని, 539 పరిశీలన దశలో ఉన్నాయని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇఆర్‌ఒలు, అధికారులు పాల్గొన్నారు.

రేపు వెంకయ్యనాయుడు రాక

భీమవరం రూరల్ : ఈ నెల 11వ తేదీ శనివారం మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతి రాజు చెప్పారు. గురువారం ఆయన మీడియాకు వెంకయ్య నాయుడు పర్యటన వివరాలు వెల్లడించారు. కళాశాలలో ఎఐసిటిఇ సహకారంతో సుమారు రెండున్నర కోట్ల వ్యయంతో నిర్మించిన ఐడియా ల్యాబ్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకుని కళాశాలలో ఏర్పాటు చేసిన సృజన వాటికను వెంకయ్యనాయుడు పరిశీలిస్తారన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులనుద్దేశించి మాట్లాడతారని తెలిపారు.

ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలి

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో పూర్తిగా ప్రభుత్వమే ఖర్చులు భరించి ఇళ్లను నిర్మించి పేదలకు ఇవ్వాలని సిపిఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణ కమిటీ సమావేశం గురువారం ఆ పార్టీ నాయకులు డోకల లక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా తవిటినాయుడు మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి కనీసంగా రూ.5 నుంచి రూ.6 లక్షలు ఖర్చవుతుందన్నారు. ప్రభుత్వం మాత్రం స్థలాలు ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. ఈ కార్యక్రమంలో బి.రాంబాబు, డి.రవితేజ, బత్తిని పార్వతి, జి.రాంబాబు, కింజరపు శంకర్ పాల్గొన్నారు.

తణుకు రూరల్ :జనన్న ఇళ్ల లబ్ధిదారులకు రూ.ఐదు లక్షలు ఇవ్వాలని సిపిఎం పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక సిపిఎం కార్యాలయంలో కామన మునిస్వామి అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ మాట్లాడుతూ గోస్తని మళ్లింపు భూమి 7.26 సెంట్లు ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ఇళ్ల స్థలాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు రంగారావు, గోపి, కె.నాగరత్నం, నరసింహారావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయొద్దు

ప్రజాశక్తి - కాళ్ల

సమాజంలో బాల్య వివాహాలను నిర్మూలించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.సూర్యకుమారి అన్నారు. కోమటిగుంట గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాలపై గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. గ్రామ సర్పంచి భాగ్యశ్రీ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సిహెచ్.వెంకటరమణ, కె.లలితమణి, బోణం శివకుమార్, ఎఎన్ఎం ఎం.కృష్ణకుమారి, అంగన్‌వాడీ టీచర్ జె.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పెనుగొండ :బాల్య వివాహాలు చేయడం నేరమని ఐసిడిఎస్ అధికారి ఎం.విజయ్‌కుమారి చెప్పారు. మండలంలోని ఇలపర్రు పంచాయతీ పరిధిలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చిన్నతనంలో వివాహాలు చేయడం వల్ల అనర్థాలు ఎక్కువగా ఉంటాయన్నారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే మహిళలకు వివాహం చేయాలన్నారు.

హరిబాబుకు ఎన్‌జిఒ నేతల పరామర్శ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎపిఎన్‌జిఒ సంఘం తాలూకా అధ్యక్షులు గుడాల హరిబాబుకు ఇటీవల హైదరాబాద్ స్టార్ ఆసుపత్రిలో బైపాస్ హార్ట్ సర్జరీ జరిగింది. అనంతరం పాలకొల్లుకు విచ్చేసిన హరిబాబును ఆయన స్వగృహంలో ఎపి ఎన్‌జిఒ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు గురువారం పరామర్శించారు. హరిబాబు సంపూర్ణ ఆరోగ్యంతో త్వరలో విధులకు హాజరవ్వాలని వారు కోరారు. పరామర్శించినవారిలో ఎపి జెఎసి అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఆరిఫ్ హుసేన్, ఎన్‌జిఒ నాయకులు పూడి శ్రీనివాస్, మేరుగ ఫణికుమార్, పాలకొల్లు తాలూకా సెక్రటరీ వేళ్ళ మురళీకృష్ణంరాజు, అసోసియేట్ అధ్యక్షులు ఎంఆర్‌కె.రాజు, ట్రెజరర్ డివి.రమణ, మహిళ విభాగం కన్వీనర్ కె.మధులత ఉన్నారు.

వశిష్ట లియో క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

చిన్నారులకు, విద్యార్థులకు లియో క్లబ్ ద్వారా ప్రోత్సాహం అందిస్తున్న లియో మెంబర్స్ సేవలు స్ఫూర్తి దాయకమని క్లబ్ అడ్వైజర్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు అన్నారు. గురువారం వశిష్ట లియో క్లబ్ డైరెక్టర్ లియో కోనా భవన్ పుట్టినరోజు సందర్భంగా క్లబ్ సెక్రటరీ లియో సంపత్ ఆధ్వర్యంలో స్థానిక భవిత కేంద్రం సందర్శించి చిన్నారులకు స్వీట్స్, బిస్కెట్స్ అందించారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని పది సచివాలయ పరిధిలో ఉన్న గ్రామ వాలంటీర్లకు, సచివాలయ కన్వీనర్లకు, గృహ సారథులకు శిక్షణ తరగతులను టిడిపి కళ్యాణ మండపంలో గురువారం మాజీ మంత్రి, ఎంఎల్‌సి చెరుకువాడ శ్రీ రంగనాథరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆచంట నియోజకవర్గ పరిశీలకులు మేడపాటి షర్మిలారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సబ్బితి సుమంగళి, సర్పంచి పెట్లలకు సువర్ణరాజు, వైస్ ఎంపిపి ఇందుకూరి సీతారామరాజు, చెకూరి సూరిబాబు, జెసిఎస్ కన్వీనర్ పైడి ఏసుబాబు పాల్గొన్నారు.

పెనుమదంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని పెనుమదం గ్రామంలో గురువారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలు తెలుసుకుని కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, గుంటూరి తాతాజీ బాబూరావు, ఎంపిటిసి మాజీ సభ్యులు దేవరపు నాగపద్మ దొరబాబు, బొక్క సూర్యనారాయణ, కొల్లు రామారావు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని వడ్లవానిపాలెంలో గురువారం నిర్వహించిన ఇదే ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కోడి విజయభాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. అంగర వీరభద్రకుమార్, వీరభద్రం పాల్గొన్నారు.

ఉచిత ఫ్రీజర్ సేవలు ప్రారంభం

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని జిన్నూరు కేంద్రంగా దీర్ఘకాలంగా సేవలందిస్తున్న నేత్రదాన ప్రోత్సాహక సంఘం మరో కొత్త సేవను ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. హేతువాద సంఘం రాష్ట్ర పూర్వ అధ్యక్షులు, నేత్రదాన ప్రోత్సాహక సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పెన్మెత్స సుబ్బరాజు సతీమణి భారతి జీవిత ప్రథమ వర్ధంతి సందర్భంగా స్మృత్యర్థం ఉద్యోగ విరమణ చేశారు. తమ ఇంటి నుంచే ఉచిత ఫ్రీజర్ బాక్స్ సేవలను ప్రారంభించారు. బంధు మిత్రుల రాకకోసం ఒకటి రెండు రోజులు పాటు మృతదేహాన్ని భద్ర పరచాల్సిన అవసరం ఏర్పడిన వారికి ఈ సేవలు ఉపయోగపడతాయన్నారు. సుబ్బరాజు, భారతి దంపతులను జెడిపి చైర్మన్ కవురు శ్రీనివాస్, గ్రామ సర్పంచి జమ్ము బేబీసరోజిని, పంచాయతీ కార్యదర్శి రాంబాబు అభినందించారు. ఈ సేవలు అవసరమైన జిన్నూరు, వేడంగి, మట్టపర్రు గ్రామ ప్రాంతాల ప్రజలు 9491184911, 9440694940 సంప్రదించవచ్చని తెలిపారు.

'కళ్యాణమస్తు'కు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - మొగల్తూరు

అర్హులైన వారికి కళ్యాణమస్తు పథకానికి దరఖాస్తు చేయించాలని ఎంపిడిఒ ఆర్‌సి.ఆనంద్‌కుమార్ సూచించారు. మొగల్తూరులోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కళ్యాణమస్తు పథకంపై నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. వివాహం చేసుకున్న ఆరు నెలల్లో దరఖాస్తు చేసుకునేందుకు వీలుంటుందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని, సంవత్సరానికి నాలుగు విడతల్లో లబ్ధిదారులకు కళ్యాణమస్తు నిధులు లబ్ధిదారుల ఖాతాలో జమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం ఎం.సుభాషిని, సీసీలు, విఒఎలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఉన్నారు.

ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ అవసరం

కాళ్ల : ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు ఆరోగ్య సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కాళ్ల ప్రాథమిక ఆరోగ్య వైద్య అధికారి డాక్టర్ పి.రమా మహేశ్వరి అన్నారు. మండలంలోని జువ్వలపాలెం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వంద మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వి పరంజ్యోతి, ఎఎన్ఎంలు భవాని, స్వాతి, ఎంఎల్‌హెచ్‌పి జ్యోత్స్న, ఆశా వర్కర్లు పైడితల్లి, దేవి, మంగా, రామలక్ష్మి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - పెనుమంట్ర

రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తప్పవని సివిల్ సప్లై ఆర్.పోతురాజు అన్నారు. మార్టేరు నుంచి ఆచంట వైపు అక్రమంగా ఆటోలో తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని స్పెషల్ బ్రాంచ్ పోలీసులు రెవెన్యూ అధికారుల సమన్వయంతో పట్టుకున్నారు. ఈ సందర్భంగా పోతురాజు మాట్లాడుతూ ఆటోలో తరలిస్తున్న 20 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. బియ్యాన్ని ఎంఎల్‌ఎఫ్ పాయింట్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బి.సురేంద్రకుమార్, విఆర్ఒ రామలక్ష్మి, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు పాల్గొన్నారు.

కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం టౌన్

కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, ఈ చట్టం ద్వారా కార్మికులకు రావాల్సిన రాయితీలు అమలు చేయాలని సిఐటియు జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, కర్రి నాగేశ్వరరావు, పూర్వపు జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకాయల బాబూరావు డిమాండ్ చేశారు. బ్రహ్మారెడ్డి మార్కెట్, ఉల్లిపాయల మార్కెట్ వర్కర్స్ యూనియన్ 37వ వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. ఈ వార్షికోత్సవంలో యూనియన్ పతాకాన్ని చల్ల చంద్రరావు ఎగురవేశారు. యూనియన్ సర్వసభ్య సమావేశానికి యూనియన్ అధ్యక్షులు చల్లా చంద్రరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భ:గా వారు మాట్లాడుతూ ఈ దేశంలో రాష్ట్రంలో పాలకవర్గాలు అవలంభిస్తున్న విధానాలు కార్మిక వర్గానికి తీవ్ర నష్టమన్నారు. కార్మిక చట్టాల్లో మార్పు, ప్రభుత్వ రంగాల అమ్మకం ఉద్యోగుల తొలగింపు చట్టాలు పార్లమెంట్‌లో మార్పు చేయటం వల్ల కార్మిక వర్గం చాలా ఇబ్బందులకు గురవుతుందని తెలిపారు. ప్రజలకు నిత్యవసర వస్తువులు సరఫరా చేయటంలో కీలకంగా పనిచేస్తున్న హమాలీ కార్మికులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సౌకర్యాలు అందడంలేదన్నారు. జిఎస్‌టి పేరుతో రూ.వేల కోట్లు ప్రజల జేబులు చిల్లు పెట్టే విధానాలు తీసుకొచ్చాయని తెలిపారు. బడ్జెట్ సమావేశాల్లో కార్మిక వర్గానికి ఏ విధమైన పరిష్కారం చూపని ఈ బడ్జెట్ పేదలకు వ్యతిరేకంగా కార్పొరేట్లకు అనుకూలంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో ఈ విధానానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేయాలని ఉన్న హక్కులను రాయితీలను కాపాడుకోవాలని తెలిపారు. ఈ దేశం లో మూసివేసిన పరిశ్రమల్ని తెరిపించే బడ్జెట్ కేటాయింపు లేదని పరిశ్రమల్ని కొత్తగా ఏర్పాటు చేయడానికి నిధులు కేటాయింపు లేదని తెలిపారు. దేశంలో పరిశ్రమల మూతతో పని దినాలు తగ్గుతున్నాయని, నిరుద్యోగం పెరుగుతుందని అన్ని సమస్యలపై ఢిల్లీలో ఏప్రిల్ ఐదో తేదీన నిర్వహించే



మాట్లాడుతున్న నాయకులు

ధర్నాకు సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం,కౌలు రైతు సంఘం ఈ జిల్లా నుంచి పెద్ద ఎత్తున పాల్గొంటారని ఈ వార్షికోత్సవ సందర్భంగా నాయ కులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపా ధ్యక్షులు రంగారావు, రైతు సంఘం నాయకులు పుల్లారెడ్డి, సత్తి కోదండరామిరెడ్డి, బంకురు నాగేశ్వరరావు, అల్లు సుబ్బా రావు, రాము, రమణ, పెద్దిరాజు జట్టు కార్మికులు పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడే వారికే గుర్తింపు

జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్

నేనూ ఒక కార్యకర్తనే : ఎంఎల్‌ఎ గ్రంధి

అట్టహాసంగా ఎఎంసి నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం


ప్రజాశక్తి - భీమవరం రూరల్

పార్టీ కోసం కష్టపడే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని, వారినే పదవులు వరిస్తాయని జిల్లా పరిషత్ ఛైర్మన్ కవురు శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక మార్కెట్ యార్డులో ఎఎంసి నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మరో ముఖ్యఅతిథి ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ తానూ వైసిపిలో ఒక కార్యకర్తనేనని, ఒక సైనికుడిగానే పని చేస్తానని చెప్పారు. రానున్న ఎన్నికల్లో 175 స్థానాలకు 175 సాధించుకోవాలని, దానికి పునాది భీమవరం కావాలని అన్నారు. ప్రశ్నిస్తా అని పార్టీ పెట్టిన జనసేన అధినేత అబద్ధపు హామీలిస్తున్న చంద్రబాబును ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి జగన్ పాలన అందిస్తున్నారని అన్నారు. అనంతరం ఛైర్మన్‌గా కోటిపల్లి నాగమల్లేశ్వరరావు (బాబు), సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ వేండ్ర వెంకటస్వామి, జెడ్‌పిటిసి కాండ్రేగుల నరసింహారావు, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, నేతలు మేడిది జాన్సన్, ఎఎస్.రాజు, తిరుమాని ఏడుకొండలు, గూడూరి ఉమాబాల, నల్లం రాంబాబు, కోడె విజయలక్ష్మి యుగంధర్, తోట భోగయ్య, చినమిల్లి వెంకట రాయుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న ఎఎంసి నూతన పాలకవర్గం

కోలాహలంగా ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి ర్యాలీ



సమయం మించిపోవడంతో వీరవాసరంలో మినిట్స్ బుక్‌లో ఎఎంసి ఛైర్మన్‌గా సంతకం చేస్తున్న కోటిపల్లి బాబు

ప్రజాశక్తి - వీరవాసరం

భీమవరం మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన కోటిపల్లి బాలదుర్గ నాగమల్లేశ్వరావు (బాబు) తన స్వగ్రామం మత్స్యపురి నుండి వైసిపి నాయకులు, కార్యకర్తలు వెంట రాగా గురువారం భారీ మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. నియోజవర్గంలో రెండో స్థానంగా రాజకీయ నాయకులు భావించే ఈ పదవి వీరవాసరం మండల నాయకులకు ఇంతవరకు అందని ద్రాక్షగానే ఉంది. ఎట్టకేలకు ఆ పదవిని భీమవరం ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ వీరవాసరం మండలానికి కేటాయించారు. ఛైర్మన్‌గా కోటిపల్లి బాబు, వైస్ ఛైర్మన్‌గా చిలకపాటి సునీత, సభ్యులుగా కడలి ధర్మారావు, మతల కాశీ, పొలమూరి బిల్‌రాజు నియమితులయ్యారు. మత్స్యపురి నుండి బయలు దేరిన ర్యాలీ బొబ్బన పల్లి, తలతాడితిప్ప మీదుగా వీరవాసరం చేరుకుని అక్కడి నుండి మండలంలోని వివిధ గ్రామాల నుం డి వచ్చి పార్టీ శ్రేణులను కలుపుకుని భీమవరం బయల్దేరి వెళ్లింది. అయితే ర్యాలీ ఆలస్యం కావడంతో ముహూర్తం మించిపోతుందని వీరవాసరంలోనే ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్నట్టు మినిట్స్ బుక్‌లో ఛైర్మన్ బాబు సంతకం చేశారు. కోటిపల్లి బాబును వీరవాసరం తహశీల్దార్ సుందరరాజు, మండల వ్యవసాయ సలహా కమిటీ ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, వైసిపి నాయకుడు నాగరాజు శ్రీనివాసరాజు, నరసాపురానికి చెందిన జనసేన నాయకులు, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు కలిసి అభినందనలు తెలిపారు.

చెట్లు నరికిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కాళ్ల

దొడ్డనపూడి గ్రామంలో ప్రభుత్వ భూమిలో 25 చెట్లు నరికిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని రైతు ఆరేటి రంగారావు తహశీల్దార్ టిఎ.కృష్ణారావుకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ మండలంలోని దొడ్డనపూడి గ్రామంలో రీ సర్వే నెంబర్ 526,509లో ఉన్న ప్రభుత్వ భూమి కాలువ గట్టుకు చేర్చి ఉన్న నిద్రగన్నేరు చెట్లు, తాటిచెట్లు సుమారు 25 చెట్లు నరికివేశారు. 32 సంవత్సరాలు కలిగిన చెట్లను అక్రమంగా నరికి అమ్ముతున్న బాలాజీపై చర్యలు తీసుకో వాలని తహశీల్దార్‌ను కోరారు.



అన్నదానం చేస్తున్న దాతలు

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు అన్నా క్యాంటీన్ వద్ద 781వ రోజు గురువారం అద్దేపల్లి గంగరాజు సత్రం తరపున అద్దేపల్లి సత్యనారాయణమూర్తి, రాంప్రసాద్ జ్ఞాపకార్థం పేదలకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను టిడిపి అధ్యక్షులు గండేటి వెంకటేశ్వరరావు అభినందించారు. 1966లో రైస్ మిల్లు అమ్మి ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థాపించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అద్దేపల్లి మోహన్‌దాస్, అద్దేపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

ప్రజాశక్తి - పోడూరు

హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణానికి ముప్పు అని, ద్విచక్రవాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ వై.నాగలక్ష్మి అన్నారు. మండలంలోని పెనుమదం గ్రామంలో తన బృందంతో కలిసి గురువారం అవగాహన కల్పించారు. హెల్మెట్ పెట్టుకుని డ్రైవ్ చేస్తున్న ద్విచక్ర వాహన దారులకు ఎస్ఐ చాక్లెట్లు అందించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహన దారులకు జరిమానా వేశారు.

త్వరలోనే ఆర్‌డిఒ, డిఎస్‌పి కార్యాలయాల పనులు

తాడేపల్లిగూడెం:తాడేపల్లిగూడెం కేంద్రంగా రెవెన్యూ డివిజనల్ కార్యాలయం, పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయాల పనులు అతి త్వరలోనే ప్రారంభమవుతాయని దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. ఇక్కడి ప్రజల ఆకాంక్ష నెరవేర్చిన సిఎం వైఎస్. జగన్మోహన్‌రెడ్డికి నియోజక వర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆర్‌డిఒ, డిఎస్‌పి కార్యాలయాలను ఏర్పాటు చేసేందుకు తాత్కాలిక భవనాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. కొత్తగా మంజూరైన తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్ పరిధిలోకి తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని తాడే పల్లిగూడెం పట్టణం, పెంటపాడు మండలం, తణుకు నియో జకవర్గంలోని తణుకు టౌన్, రూరల్, అత్తిలి, ఇరగవరం మండలాలు వస్తాయని తెలిపారు. పోలీసు సబ్ డివిజన్‌కు సంబంధించి వీటితోపాటు అదనంగా గణపవరం మండలం కూడా కలుస్తుందని తెలిపారు.

చిన్నగంగయ్యకు సత్కారం

ప్రజాశక్తి - ఉండి

మానవతావాది, భీమవరం కోర్టు విశ్రాంత సబార్డినేట్ జడ్జి పెరికల చిన్న గంగయ్యను చెరుకువాడ గ్రామ సర్పంచి కొండవీటి సాంబశివరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కొండవీటి సాంబశివరావు మాట్లాడుతూ పెరికల చిన్న గంగయ్య గొప్ప సంఘ సేవకులు అని, నీతి నిజాయితీలతో పనిచేసి జడ్జి పదవికి వన్నెతెచ్చారని కొనియాడారు. గ్రామంలోని పాఠశాలల అభివృద్ధికి, సిమెంట్ రోడ్ల నిర్మాణానికి తనవంతు సహాయ సహకారాలు అందించారన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి గ్రామంలోని వృద్ధులకు నెలకు సరిపడా బియ్యం, ఆర్థిక సహకారం వంటివి అందించి గొప్ప మానవతావాది అని నిరూపించుకున్నారన్నారు. తనకున్న దానిలో సాటివారికి సాయం చేయడంలో ఎల్లప్పుడూ ముందుంటారన్నారు. ప్రతిఒక్కరిలో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడంలో కీలకపాత్ర వహించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు చిగురుపాటి క్రిష్టోఫర్, గ్రామపంచాయతీ కార్యదర్శి కేశిరెడ్డి గోపాలకృష్ణ, గ్రామ రెవెన్యూ అధికారి సైదాడ చిన్నారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నగంగయ్యను సత్కరిస్తున్న సర్పంచి, గ్రామస్తులు

నిట్‌తో శ్రీవాసవి పరస్పర సహకారానికి ఒప్పందం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందించేందుకు వీలుగా అకాడమిక్ అంశాలు, పరిశోధన, అంతర్జాతీయ, జాతీయ లోకల్ కమ్యూనిటీ ప్రాజెక్టు నిధులను సాధించడంలో పరస్పర సహకారం అందించుకునేందుకు, టీచింగ్ లెర్నింగ్, పరస్పరం సహకారాన్ని అందించుకునేలా జాతీయ సాంకేతిక విద్యా సంస్థ నిట్, శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. నిట్ ఎస్ఆర్‌కె సెమినార్ హాలులో గురువారం నిర్వహించిన అవగాహన ఒప్పంద మార్పిడి కార్యక్రమంలో నిట్ ఇన్‌ఛార్జ్ డైరక్టర్ డాక్టర్ ప్రమోద్ పడోలే ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ దినేష్‌శంకర్‌రెడ్డి, రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డీన్ డాక్టర్ జివి.రవికిరణ్‌శాస్త్రి, శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ చలంచర్ల సుబ్బారావు, టెక్నికల్ డైరక్టర్ అప్పారావు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు.

ఎస్‌సి వర్గీకరణ వద్దు : మాలమహానాడు

ఆచంట : ఎస్‌సి వర్గీకరణకు అనుకూలంగా ఏ రాజకీయ పార్టీలైన మద్దతిస్తే ఆ పార్టీలకు వచ్చే ఎన్నికల్లో మాల మహానాడు ద్వారా తగిన గుణపాఠం చెబుతామని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య అన్నారు. మాల మహానాడు ఆధ్వర్యంలో చలో ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఆచంట వేమవరం ర్యాలీగా చేరుకున్నారు. తొలుత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

రామకృష్ణంరాజు ఆశయం స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల వ్యవస్థాపకుల్లో ఒకరు, నాగార్జునసాగర్ డ్యామ్ నిర్మాణంలో అత్యుత్తమ సేవలు అందించినందుకు అనాటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ చేతులు మీదగా మెటల్ కింగ్ అవార్డు అందుకున్న సాగి రామకృష్ణంరాజు 40వ వర్ధంతి సభ కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు, వైస్ ప్రెసిడెంట్ ఎస్‌వి.రంగరాజు మాట్లాడుతూ సాగి రామకృష్ణంరాజు ఆశయ స్ఫూర్తితో ఏర్పాటు చేసిన కళాశాల నేడు అంతర్జాతీయ ఖ్యాతి గడించి వేలాది మంది ఇంజినీర్లను తయారుచేసి దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉండే విధంగా తీర్చిదిద్దిందన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇప్పటికి ఐదు రక్తదానం చేసిన కళాశాల సిఎస్ఇ డిపార్ట్‌మెంట్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.అరుణకుమారిని ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ఉపాధ్యక్షులు ఎస్‌వి.రంగరాజు అభినందించారు. ఎఎస్ఎన్ రాజు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు సుమారు 110 యూనిట్ల రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.కృష్ణచైతన్య వివిధ విభాగాల హెడ్స్ పాల్గొన్నారు.

ప్రతి నెలా గర్భిణులకు పరీక్షలు

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రతినెలా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తూ ఉచితంగా మందులు అందిస్తున్నామని పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు రంగంనాయుడు, నిరంజని అన్నారు. పాలకోడేరు పిహెచ్‌సిలో గర్భిణులకు ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం రక్త పరీక్షలు, వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ సత్యనారాయణ, హెచ్‌విలు, ఆయా గ్రామాల ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సముద్రతీరంలో వానరాల మృతదేహాలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కెపి పాలెం సౌత్‌లోని సముద్ర తీరంలో వానరాల మృతదేహాలు కలకలం రేపుతున్నాయి. ఈ ప్రాంతంలోని సర్వే తోటల్లో వందల సంఖ్యలో కోతుల మృతదేహాలు ఉన్నాయి. కొన్ని వానరాలు ప్రాణాలతో అటు ఇటు తిరుగుతున్నాయి. వేరే ప్రాంతంలో కోతులపై విష ప్రయోగం చేసి ఈ ప్రాంతానికి తీసుకొచ్చి వదిలి ఉంటారని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సంఘటనకు సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ ఎం.వీరబాబు విచారణ చేపట్టారు.

నోటీసు

మహారాజశ్రీ గుంటూరు 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఐ.ఎ.నెం:63/2018 ఇన్ ఐ.ఎ.నెం:956/2012 ఇన్ ఒ.యస్. నెం: 662/ 2007

బిట్వీన్:
డాకా సింగా రెడ్డి ...పిటీషనరు/వాది
మరియు
సిద్దే నాగేంద్రమ్మ వగైరాలు ...రెస్పాండెంట్స్/ ప్రతివాదులు

టు,
R-5/D-5. నాయిని సాయినాథ్,తండ్రి.శంభునాథ్ . నివాసం.డోర్ నెం: 254-25,ప్లాట్ నెం:202, యెర్నేని మ్యాన్సన్ అపార్టుమెంట్స్, కట్టా సుబ్బా రావు వీది, నరసింహారావు పేట, ఏలూరు టౌన్, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరు దావాలోని ఐ.ఎ.లో5వ రెస్పాండెంట్/ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Substituted Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది: 03-03-2023న ఉ. గం.10-30 ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కాని, మీ అడ్వకేటు ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపర్చుడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)

వాయిదా తేది:03-03-2023

సి.నరేంద్ర బాబు,
పిటీషనరు/వాది తరపు అడ్వకేట్,
గుంటూరు,సెల్:92464 85115

మహారాజశ్రీ 2వ అదనపు జిల్లా కోర్టు వారి దివ్య సముఖమునకు, అమలాపురం

I.A. No. 704/2015, O.S. No. 14/2014

Between:
లక్కింశెట్టి వరలక్ష్మి and another -పిటీషనర్స్/ వాదులు
AND
లక్కింశెట్టి వెంకట రంగనాయకమ్మ and others -రెస్పాండెంట్స్/ ప్రతివాదులు

12వ రెస్పాండెంట్/ ప్రతివాది:
అంత్యం కృష్ణకుమారి, W/o. నాగేశ్వరరావు, హిందువు, వయస్సు 46 సం॥లు, మడుగు పోలవరం, వీరవాసరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా.

పేపరు ప్రకటన

పై నంబరు దావాలో O.S. 14/2014 లో I.A. 704/2015 లో 12వ రెస్పాండెంట్/ ప్రతివాది అయిన మీరు శ్రీ కోర్టు వారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను అందుకొని యుండలేదు. కాబట్టి శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం పేపరు ప్రకటన వేయడమైనది. 12వ రెస్పాండెంట్/ ప్రతివాది అయిన **మీరు ది. 13-02-2023న కోర్టులో వాయిదా అయి వున్నది.** కావున వాయిదా రోజున మీరు గాని, మీ ప్లీడరు గారు ద్వారా గాని హాజరు అయ్యి మీ అభ్యంతరములను తెలియచేయవలెను. లేనిచో పరోక్షముగా తీర్మానితులు అవుదురు.

వాయిదా: 13-02-2023
సమయం: 10.30 ని॥లకు

అమలాపురం
తేది:08-2-2023

కె.మల్లపరాజు
కె.ఎస్.శ్రీరామ్
అడ్వకేట్స్, అమలాపురం

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

H.M.O.P.No. 210/2021

పిటీషనరు: పాము స్వామి అయ్యప్ప
రెస్పాండెంట్లు: పాము లక్ష్మి
రెస్పాండెంటు: పాము లక్ష్మి, భర్త: స్వామి అయ్యప్ప, తండ్రి: పోతుమాని మల్లయ్య స్వామి, వినాయకుడి గుడి వద్ద, గౌందుమూల సెంటర్, వేములదీవి, నరసాపురం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరు పిటీషను గ్రంధము నందు మీయొక్క హాజరు నిమిత్తం సమన్లు మీ అడ్రసుకు అనేక పర్యాయములు కోర్టు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను పంపించినను వాటిని మీరు అందుకొని ఉండుట లేదు. అందువలన మీరు **ది.14-02-2023 సం॥రం తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాన హాజరై పై కోర్టు వారి ఎదుట మీ ఆక్షేపణలు తెలియ పరుచుకొనవలెను.** అట్లు హాజరు కానిచో మీ పరోక్షములో సదరు పిటీషను తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

కె.వి.రమేష్
పెన్నాడ, పిటీషనరు తరుపు అడ్వకేట్,
06-2-23. పెన్నాడ. ప॥గో॥జిల్లా.

Summons

In the Court of the Senior Civil Judge, Tadepalligudem

O.S. No. 79/2008

Between:
1. Chinta Veereddy @ Veerayya (died)
2. Tamanampudi Vijayalakshmi
3. Chinta Srinivasa Reddy ***...Plaintiff***

AND

1. Chinta Ramachandra Reddy and others ***...Defendants***

To:
Defendants 7 to 9:
7. Chinta Dileep Reddy, S/o. Chinta Ramachandra Reddy, age 38, Hindu, Male, Business, D.No. 2-10/2, Main Road, Mupparthipadu Village, Ganapavaram Mandal, TPG PJCJC - 534134.
8. Medapati Karuna Sri, W/o. Ratna Reddy, aged 48 years, Hindu, Female, Housewife, D.No. 5-5, High School Road, Pali, Near Attili, Attili Mandalam, West Godavari District - 534225.
9. Injeti Sunita, W/o. Injeti Babji, aged 43, Hindu, Female, Housewife, D.No. 4-139, Harijanapeta, Kesavaram, Ganapavaram Mandal, West Godavari District, TPG PJCJC - 534 188.
(Defendants 7 to 9 are added as per orders in I.A. No. 147/2022 dt. 22-09-2022)

Please take notice that the above suit is filed by the plaintiffs against the defendants which is posted for the appearance of the above defendants 7 to 9 **on dt. 10-03-2023 from 10.30 A.M.** onwards on which day you may appear in person or through your advocate and file your objections/ pleadings if any. Otherwise the matter will be adjudicate according to law in your absence.

G.SYAM PRASAD MUKHERJEE
Tadepalligudem **N.SURYA MANI**
Date:05-02-2023 Advocates, Tadepalligudem

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా

E.P.No.22/2020
in O.S.No. 349/2011

డి. హెచ్. ఆర్: మందరపు దుర్గ ప్రసాద్ బాబు
జె. డి. ఆర్: పిన్నమరాజు వెంకట సత్యనారాయణ రాజు వగైరా

1వ జె. డి. ఆర్:
పిన్నమరాజు వెంకట సత్యనారాయణ రాజు (డైడ్)

2వ జె. డి. ఆర్:
పిన్నమరాజు సావిత్రి, భర్త: (లేటు) పి.వెంకట సత్యనారాయణ రాజు, C/o. ముదుండి దుర్గ, డో.నెం.20-3-317, గొట్టుముక్కల వెంకట సుబ్బారావు నగర్, ఆకివీడు, గవర్నమెంటు హైస్కూల్ ఎదురుగా, ఆకివీడు మండలం, ప॥గో॥జిల్లా.

3వ జె. డి. ఆర్:
పిన్నమరాజు మాధవరాజు, తండ్రి: (లేటు) పి.వెంకట సత్యనారాయణ రాజు, C/o. ముదుండి దుర్గ, డో.నెం.20-3-317, గొట్టుముక్కల వెంకట సుబ్బారావు నగర్, ఆకివీడు, గవర్నమెంటు హైస్కూల్ ఎదురుగా, ఆకివీడు మండలం, ప॥గో॥జిల్లా.

4వ జె. డి. ఆర్:
పిన్నమరాజు విజయలక్ష్మి తండ్రి: (లేటు) పి.వెంకట సత్యనారాయణ రాజు, C/o. ముదుండి దుర్గ, డో.నెం.20-3-317, గొట్టుముక్కల వెంకట సుబ్బారావు నగర్, ఆకివీడు, గవర్నమెంటు హైస్కూల్ ఎదురుగా, ఆకివీడు మండలం, ప॥గో॥జిల్లా.

పై నెంబరు దావాలో జె.డి.ఆర్ 2, జె.డి.ఆర్ 3 మరియు జె.డి.ఆర్ 4 అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ మీకు అందని దర్మిలా శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసు ఆర్డరు వేసి ఉన్నారు. పై నెంబరు దావా **ది.02-03-2023వ తేదీకి వాయిదా అయి ఉన్నది. కావున మీరు ఉదయం గం॥ 10:00 ని॥లకు పై కోర్టు వారి ముందు హాజరు అయి మీ వాదనను వినిపించవలెను.** లేని ఎడల మీ పరోక్షమునందు మీకు వ్యతిరేకముగా విచారణ జరుగును.

వాయిదా తేదీ: 02-03-2023.

ఎన్.వి.శేషసాయి,
ఎస్.సత్యనారాయణ,
కె.బి.రాజశేఖర్,
డి. హెచ్. ఆర్ తరుపు అడ్వకేట్స్,
భీమవరం. సెల్: 93919 87799